# చెల్లీ! రైలెక్కకమ్మా!!

కుటుంబరావు కుంటి పడకకుర్చీలో కూర్చుని కళ్ళజోడు సరిచేసుకుంటూ ప్రక్క యింటాయన జాలితలచి యిచ్చిన దినపత్రిక ఆతురతగా చదవబోతూ తలతిప్పి చూడకుండానే

"ఏమేవ్! నిన్నే, ఓసారి యిలా తగలడు" అన్నాడు. ఇలా మాట్లాడటం ఆయన అలవాటు. అయితే యింక ఆయన భార్య లక్ష్మీ నర్సుకి వళ్ళు అంతా చికాకే పాపం.

"ఏమిటా గావుకేకలు. నేను డన్‌లప్ పరుపు మీద నిద్దరోతున్నానా" అంటూ వచ్చింది. ఆవిడ ప్రతిమాటా భర్త అడ్డుదారుల్లో డబ్బు సంపాదించలేని 'చవట' అన్న ధ్వని వినిపిస్తూ వుంటుంది. నిజానికి కుటుంబరావుకి వళ్ళు మండినా శాంతం తెచ్చుకుంటూ.

"ఇదిగో యివాళ సెలవుగా. కాస్త ఓ కప్పు కాఫీ యివ్వు. ఇంకాస్సేపు వుంటే యెదిరింటి గోపాలరావు కాలక్షేపం కబుర్లకంటూ వస్తాడా యింక చస్తే నువ్వివ్వవు" అనేసి పేపరులోని వార్తలు బిగ్గరగా చదువుతూ వుంటే లక్ష్మీ నర్సు మండిపోతూ "యెవరింట్లో కన్నం వేసి తేను కాఫీ పొడి. యిదిగో చెపుతున్నా ఘడియకోసారి మీరు కాఫీ అంటూ, చిన్నది పైట అంటూ మూడోది పుస్తకాలూ, పెన్సిళ్ళూ అంటూ వేధిస్తే నే బ్రతకాలా అసలే నీరసంతో చస్తున్నా. లేడీ డాక్టరు తన సొమ్మేం పోయిందీ "వీక్‌గా వున్నావు పళ్లరసం తాగు పరమాన్నం తిను" అంటూ యింత పొడుగు పాఠం చదువుతుంది. ఛీఛీ - !" ఆవిడ ఆయాసం తీర్చుకునేందుకు క్షణం ఆగింది.

"లక్షాధికార్ల యిళ్ళలో పుట్టి వుంటే బాగుండేది." కుటుంబరావు కోపంగానే అన్నాడు.

అక్కడ పుట్టే అదృష్టం వుంటే యీనరకంలో మరెవరుంటారు. వెధవ కొంప, యెక్కడికన్నా పారిపోవాలనిపిస్తుంది."

"ఇప్పుడు మాత్రం యేం పోయింది. మహారాణిలా వెళ్ళు, కానీ నీకీ ఆలోచన పదేళ్ళ ముందన్నా వచ్చి వుంటే యెంత బాగుండేది"

"యెంతో బాగుండేది. కానీ యీ దేశంలో ఆడదానికి అంత తెగింపు రావటానికి యింకా నాలుగు శతాబ్దాలన్నా పడుతుంది."

"నాలుగు శతాబ్దాలు పట్టనీ నలభై శతాబ్దాలు పట్టనీ నాకు అక్కరలేదు. నాక్కావాల్సింది అర కప్పు స్ట్రాంగ్ కాఫీ."

"లేదూ లేదూ"

జీతం మూడువేలు నీ ముఖానే పోశాగా.

"ముష్టి మూడువేలు. దానిప్రక్క మరో సున్నా పెట్టినా వచ్చేంత జీతం చాలనంత ఖర్చు తగలబడింది యీకొంపలో" నిర్లక్ష్యంగా అంటూ భార్యని నమిలి మింగేయాలన్పించింది. కానీ నిగ్రహించుకున్నాడు. తనే గనుక కోపాన్ని అదుపులో వుంచుకోకపోతే యీ సంసారం యెప్పుడో ముక్క చెక్కలు అయి వుండేది. అందుకే నోటి దురుసు భార్య దగ్గర తనే నోరు మూసుకుని కాలం వెళ్ళదీస్తూ యాభై నాలుగో సంవత్సరంలోకి అడుగు పెట్టాడు గుమాస్తాగా బ్రతుకు వెళ్ళదీస్తున్న కుటుంబరావు.

కుటుంబరావుకి వుద్యోగంలో ప్రమోషను లేదుగానీ నలుగురు ఆడపిల్లలూ యిద్దరు మగపిల్లలూ. ఆడపిల్లలకి లక్ష్మీనర్సు మురిపెంగా యిలా పేర్లు పెట్టుకుంది. 'శ్రీలక్ష్మి' 'ధనలక్ష్మి' 'ధాన్యలక్ష్మి' 'వరలక్ష్మి' అని అయితే యింకా మహాలక్ష్మి, ఆదిలక్ష్మి వగైరా పేర్లు మిగిలిపోయాయని ఆవిడకి దిగులు. వీళ్లందరికంటే పెద్దవాడు శ్రీహరి. ఆఖరివాడు సౌమిత్రికి పదేళ్లు వచ్చినా చదువు వంటబట్టక యెప్పుడూ చూసినా సినిమా బండీలవెంట పరుగులు తీస్తూ వాళ్ళుపంచే కాయితాల కోసం యెన్ని మైళ్ళైనా సరే పరుగుతీస్తూ విరామం లేకుండా సినిమా పాటలు పాడుతూ ఇంట్లోవాళ్లకి పిచ్చి యెక్కేలా అరిచే సౌమిత్రికి 'మైండ్' సరిగాలేదు అంటుంది లక్ష్మీ నర్సు.

"గవర్నమెంటు ఆసుపత్రి వుందిగా చూపించి చావకూడదూ" అని ఓ అరుపు అరిచి యింక ఆ విషయం తనకి పట్టనట్లు వూరుకుంటాడు. అసలు యీ భార్యా

భర్తలని చూస్తే ఒకనాడు యిద్దర్నూ ప్రేమించి పెళ్ళాడారని కానీ ఒకర్ని వదిలి వొకరు ఒక్క రోజన్నా వుండలేకపోయే వాళ్లని గాని చెప్పినా నమ్మరు. హుషారుగా వుండే కుటుంబరావు ఆర్ధిక చికాకుల్లో నలిగిపోతూ ఆనైరాశ్యాన్ని తట్టుకోలేక చీటికీ మాటికీ భార్యమీదా, పిల్లలమీదా విరుచుకు పడిపోతూ అంతకు పదిరెట్లుగా అసహనంతో వూగిపోయే భార్య నోటికి మాత్రం దణ్ణం పెడుతూ యిప్పుడిప్పుడు అన్నిటికీ మౌనానంద స్వాముల వారులా కుంటి పడక కుర్చీలో కూర్చుని కాలం వెళ్ళదీస్తున్నాడు.

ఇంక లక్ష్మీ నర్సు యే పేరంటానికి వెళ్ళినా ఇరుగూ పొరుగూ అమ్మలక్కలు "మీ శ్రీలక్ష్మీ పెళ్ళెప్పుడు, మాకు పప్పన్నం యెప్పుడు" అంటారు.

లక్ష్మీనర్సుకీ పాపం అల్లుడు రావాలనీ పండగలకీ పబ్బాలకీ నట్టింట్లో తిరగాలనే వుంటుంది లోపల. కానీ కబుర్లతో కూతురు పెళ్లి అయ్యేపని కాదే అయినా ఓ నవ్వు నవ్వి.

"మా అబ్బాయి బి.ఏ. పాసై మా చిన్నాన్న వూళ్ళో వుద్యోగంలో చేరాడు. వాడికి పాతిక వేలు కట్నం యిస్తాం అని రోజు కొకరుగా వచ్చి తిరిగి వెడుతున్నారు. యేదో ఒకటి చూసి ఖాయం చేసుకుని ఆ డబ్బు యిలా తీసుకుని అమ్మాయి కిచ్చేసి అల్లుడిని కొనేసుకుంటాం. అవునూ మీ యెరికిలో యేవైనా మంచి సంబంధాలుంటే చెప్పండి" అనటంతో వాళ్ళు మూతులు తిప్పుకుని అబ్బో యీవిడ కొడుక్కి పాతిక వేలు కట్నం రావటం నిజమే. అది కూతురు కివ్వడమూ నిజమే అనుకుని పైకి మాత్రం "మాకేం తెల్సు పెళ్ళిళ్ళ పేరయ్యను కనుక్కోండి" అనేస్తారు.

లక్ష్మీనర్సు అలా వాళ్ళ నోర్లు మూయించి ఇల్లు చేరుంతుందేకాని తన ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు ఎలా జరుగుతాయి అని ఆవేదన పడిపోతూనే వుంటుంది. భగంతుడిని ప్రార్థిస్తూనే ఉంటుంది. అన్నీ సవ్యంగా జరిగేలా చేయమని.

శ్రీహరిని స్కూలు ఫైనలు అవగానే తండ్రి యింక కాలేజీ చదువు నావల్లకాదు. అని అనగానే "నేనే చదువుకుంటా" అనేసి లక్ష్మీనర్సు పినతండ్రి అయిన గోపాలంగారి దగ్గర వుండి యెంతో కష్టపడి ట్యూషన్లు చెప్పుకుని కాలేజీ ఫీజు కట్టుకుని తాతగారింట్లో భోజనం చేస్తూ యెలాగో డిగ్రీ చదువు పూర్తి చేశాడు. గోపాలంగారు ఇతని శ్రద్ధకి ముచ్చటపడి తనే రికమండ్ చేసి మంచి ఉద్యోగం ఇప్పించాడు.

ఈ వార్త తండ్రికి ఉత్తరం రాశాడే కానీ ఇప్పటికి సంవత్సరం అయినా ఒక్కనెలా పైసా పంపలేదు. నెల మొదటి వారం అంతా పోస్ట్‌మేన్ కోసం చూసివిసుగెత్తిన

కుటుంబరావు నోరు నెప్పిపెట్టేవరకూ కొడుకుని తిట్టి అలసిపోయి వూరుకునేవాడు. ఇంక ఆయనలో సహనం నశించి కొడుక్కి టెలిగ్రామ్ లాంటి ఉత్తరం రాశారు. వెంటనే ఓ సారి ఇక్కడికి తగలడు అని. లక్ష్మీనర్సు కొడుకు విషయం ఎత్తితే చాలు నల్లరాయిలా జవాబివ్వదు. కుటుంబరావుకి లోలోపల అనుమానం కూడా వేధిస్తోంది. ఈ పాపిష్టిది నాన్నకు డబ్బు పంపకు అని చాటుగా ఉత్తరం రాసి చావలేదుకదా! అని. ఈ విషయం ఇవాళ తేలిపోవాలి. ఆ వెధవ రావల్సింది ఇవాళేగా! అన్న ఆలోచన రాగానే కుటుంబరావుకి పేపరులో వార్తలు బుర్రకి ఎక్కడంలేదు. మనస్సు వీధి వాకిలి దగ్గర వుంది. ప్రాణం కాఫీకోసం కొట్టుకుంటూ వుంది. కళ్ళుమాత్రం పేపరులోని అక్షరాలని చూస్తున్నాయి. తనుకాఫీ గత ప్రాణినని భార్యకి తెల్సినా కదలటంలేదంటే బహుశా కాఫీ పొడి డబ్బా ఖాళీ అయి వుండాలి. పాపం. తన భార్య మంచిదే కాని యేదైనా కావాలన్నారా రాక్షసిలా విరుచుకుపడుతుంది. అందుకే ఇంక కాఫీ మాట యెత్తలేదు.

ఇంతలో ఆఖరి కొడుకు ఓ హిందీ సినిమా పాట బొంగురు గొంతుతో పాడుతూ వచ్చేసరికి కుటుంబరావుకి చిర్రెత్తుకొచ్చింది. చెవులు గట్టిగా మూసుకుని "నోరుమూసుకోరా అని అరిచాడు నాలుగుసార్లు. కానీ వాడు యింకాస్త పెద్దగొంతుతో పాడేస్తున్నాడు. తండ్రి కల్లు తాగిన కోతిలా గంతులేస్తూంటే చూడటం వాడికి భలేసరదా.

"అబ్బబ్బ" కుటుంబరావు అసహనంగా కుంటి కుర్చీలో వెనక్కి వాలాడు.

"నాన్నా ఆ పిచ్చాడి పాట ఆపించు. అసలే గార్దభస్వరం వీడూనూ" రెండో కూతురు యెదురింట్లోనించి యెరువు తెచ్చుకున్న పది పైసల లైబ్రరీ డిటెక్టివ్ నవల యమ సస్పెన్స్‌తో చదివేస్తూ విసుక్కుంటూ గావుకేక పెట్టింది ప్రక్కగదిలో నించి.

లక్ష్మీ నర్సు కొడుకుని కోప్పడేసరికి వాడు వీధిలోకి పరుగుతీశాడు.

"ధనలక్ష్మి ఏం పుస్తకం చదువుతున్నావమ్మా" అడిగాడు

"మీలాంటి పెద్దవాళ్ళు చదివేదికాదు నాన్నా" .

"ప్రేమ కథ"

"కాదు"

మరి అదేంటో త్వరగా చెప్పియేడవ్వే"

"అక్కకి ప్రేమకథల పిచ్చీ, నాకు డిటెక్టివ్‌ల పిచ్చీ అని తెల్సే అడుగుతావేం నాన్నా! యీ నవల భలే సస్పెన్స్‌గా ఉంది. ఇది చదువుతూ ఆకలీ, నిద్రా అన్నీ మర్చిపోవచ్చు."

"అయితే నాక్కాసేపిలా ఇవ్వు. అసలే కాఫీ తిక్కతో చస్తున్నాను. జాలిగా అడిగాడు.

"లాభంలేదు నాన్నా. అమ్మ ఇప్పుడే నాకన్నం పెట్టదు. పోనీ పెట్టమని చెబితే ఇది నీకిచ్చేస్తా"

భార్యవైపు చూశాడు. ఆవిడ "ఇంకా వంటే అయిచావందే. పెద్దది చవట ముఖంది. పని చేసీ చేసీ తెమిలిచావదు. నాకేమో నీరసంతో ప్రాణం పోయేలా ఉంది" కూతురిక్కూడా వినిపించేలానే అంది.

"ఇంక విన్నావుగా. ఆ పుస్తకం యిలా తగలెయ్యి"

"కాస్సేపు ఆగునాన్నా"

"ఓసి నీ దుంపతెగ. కాఫీ తిక్క వదుల్చుకుందాం అంటే నువ్వా గదిలోనుంచి రాకుండా నీలిగిచస్తున్నావా. అయినా క్లాసు పుస్తకాలు మానేసి వెధవ నవలలు చదువుతున్నావా వుండు నీ పనిచెప్తా" అంటూ చివాలున లేవబోయేసరికి కుర్చీ గుడ్డ ఫర్‌న చిరిగిపోయింది.

"అయ్యో ఇంక ఈ కాస్త సుఖం కూడా కరువుచేశావా దేవుడా" అని దానివైపు చూస్తూండగానే ప్రక్కగదిలోనించి ధనలక్ష్మి ముఖం మాడ్చుకుని పుస్తకం తెచ్చి తండ్రికి ఇవ్వబోయింది. ఆయన చిరిగిన కుర్చీ గుడ్డమీద నుంచి దృష్టి కూతురు వైపు తిప్పాడు.

ధనలక్ష్మి ముఖం నీరసంతో వడలిపోయినట్లుంది. ఆయన మనసు ద్రవించిపోయింది.

"ఆకలి అందరిది ఒక్కటే పసిది..." అనుకుంటూ "వద్దమ్మా నువ్వే చదువుకో తల్లి" అనటం తడవుగా "నాన్నా నువ్వెంత మంచివాడివి" అంటూనే పుస్తకం పట్టుకుని ప్రక్కగదిలోకి పరుగుతీసింది.

"నువ్వలా గుమ్మం దగ్గర కాపలా కాయబోతే ఆవంట పూర్తి చెయ్యరాదూ త్వరగా, ఆ పెళ్ళి కాని ఆడపిల్లలని కాల్చుకు తినకపోతే."

"రోజూ నే చేయటంలా. ఇవాళ అబ్బాయి వస్తాడనీ..." అంటూనే వీధిలోకి తొంగిచూస్తూంటే

"వచ్చేవాడు వీధిలో ఆగిపోడు కానీ ధనలక్ష్మికి పుస్తకం ఇచ్చిన పిన్నిగారంటే మన యెదురింటావిడేనా. నలుగురు పిల్లల తల్లి అయినా బింకం చెడలేదు. పెళ్ళికాని పిల్లలా వుంటుంది. ఆవిడకి ముప్ఫై ఏళ్ళూ లేవూ."

భార్యతో కబుర్లు చెబుతూవుంటే అయినా కాలం జరుగతుందని కుటుంబరావు బాతాఖానీ మొదలెట్టాడు.

"యెన్నేళ్ళు అని లెక్క యెందుకు. పెళ్ళి కాని పిల్లలా రోజుకో రకంగా సింగారించుకుంటుంది. చీరెలూ, నగలూ, సినిమాలూ, షికార్లూ అదృష్టవంతురాలు పూర్వజన్మలో బంగారు పూలతో పూజ చేసిందేమో మన్మధుడిలాంటి భర్త, పైగా ఆఫీసరు హోదా. రత్నాల్లాంటి పిల్లలు. బ్రతికిన నాల్రోజులైనా హంసలా బ్రతకాలి. ఛీ నా బ్రతుకు ఉంది యెందుకు"

నిస్పృహగా నిట్టూర్చే భార్యని చూస్తే మండి పోయింది కుటుంబరావుకి.

"నువ్వూ ఆవిడలా ఎందుకుండకూడదు."

"మీరు ఆఫీసరు అయి వుంటే... అంతకంటే యెక్కువగానే ఉండే దానిని"

"నోర్ముయ్. కాలు గడపదాటదు కానీ మాటలు కోటలు దాటుతాయి."

"ముప్పైయేళ్ళ బట్టీ నోరు మూసుకు చావటంలేదూ." అని గిరుక్కున ముఖం తిప్పేసుకుని "ఒసేధనం, ఒసే శ్రీలక్ష్మి యెక్కడికి చచ్చారే. వంటకాలేదూ" బిగ్గరగా అరిచింది.

"అక్క చాలా సేపటినుంచి కన్పించటంలేదమ్మా" మూడో కూతురు జావాబిచ్చింది.

"నీళ్ళకి తగలడిందేమో. బిందెయెత్తుకుని రాచకార్యాలు చేసి చస్తుందయ్యే. అలా వెళ్ళి రమ్మని పిల్చుకురామ్మా."

ఇంతలో నాలుగిళ్ళ అవతలవున్న గోపాలరావు భోజనం చేసి తాంబూలం నవులుతూ కాలక్షేపం కోసం చదరంగం ఆడటానికి అవి పట్టుకుని వచ్చి బార్యా భర్తలని పరామర్శించి తీరుబడిగా కూర్చుని.

"ఇంకా స్నానం, భోజనం కానట్టుంది. నీకాలశ్యం వుందంటే ఓకునుకు తీసి మరీ వచ్చేవాడిని." అంటూ చిరిగిన కుర్చీ గుడ్డవైపు చూస్తూ

"అయ్యో! నీ విక్రమార్కుడి సింహాసనం..." అంటూ ఆగాడు.

"ఆఁ దాని సర్వీసులో నాకు చాలా సేవే చేసింది" నిట్టూర్చాడు.

"మీరు అదృష్టవంతులు అన్నగారూ. కొడుకులు అందివచ్చారు. ఉద్యోగంలో రిటైరై కాలుమీద కాలు వేసుకుని కృష్ణా రామా అనుకుంటూ జీవితాన్ని నిర్విచారంగా లాగేస్తున్నారు." లక్ష్మి నర్సు మాటల్లో ఆత్మీయత కంటే అసూయే ధ్వనిస్తూన్నా ఆయన నవ్వి.

"నీ నోటివాక్యాన అంతా బాగానే జరుగుతోంది. అన్నట్లు మీ పెద్దాడు వస్తున్నాడా" విషయం వాళ్ల సంసార పరిస్థితులపై తిప్పుతూ తెలివిగా అడిగాడు గోపాలరావు.

"కళ్ళు కాయలు కాసేలా చూడటమే మిగులుతోంది" నిర్లిప్తంగా అంది.

ఇంతలో చిన్నకొడుకు వస్తూ 'అమ్మా ఆకలి..అక్కయ్య కన్పించలేదమ్మా' అనేసరికి ఛీ అలా పోయి చూడు.' అని తిరిగి కబుర్లలోకి దిగింది.

ఇంతలో వాకిట్లో ఆటల్లో వున్న ఆఖరు ఆడపిల్లలు "అమ్మోయ్ అన్నయ్య వస్తున్నాడోచ్" అంటూ పరుగున వస్తూ బోర్లాపడి పళ్లకి దెబ్బ తగిలి రక్తం కారుతున్నా లక్ష్యం చెయ్యక 'అన్నయ్య అన్నయ్య' అంటూండగానే శ్రీహరి లోపలికి వచ్చాడు. "అమ్మా" అంటూ తల్లి దగ్గరికి వస్తూంటే ఆవిడ పొంగిపోతూ "నా తండ్రి నా నోములపంట నా బంగారు కొండ నా ఇంటిదీపం నా నాయన వచ్చావా" అంటూ అమాంతం కౌగలించుకుంది. ఆవిడ కళ్లలో నీల్లు ఆపుదామన్నా ఆగటంలేదు.

"నాన్నా బాగున్నారా!" తండ్రిని పలకరిస్తుంటే ఆయన ఉద్యోగస్తుడైన కొడుకుని ఓరగా చూస్తూ మళ్లీ కోపం తెచ్చుకుంటూ 'ఊ' అని ప్రయాణం బాగా జరిగిందా. అన్నట్లు కాళ్లు కడుక్కుని మంచి నీళ్ళు తాగు" అంటూ కూతుర్ని కేక పెట్టింది.. లక్ష్మీనర్సు "ధనం ఆ చేత్తోనే కాఫీ కూడా పట్రామ్మా ఎప్పుడు తాగాడో ఏమో..." అంది సంతోషం పట్టలేక.

గోపాలరావు శ్రీహరిని పలకరించి అన్నీ అడిగి నర్సువైపు చూస్తూ "చెల్లెమ్మా శ్రీహరికి చాలా పెళ్లి సంబంధాలు వచ్చాయని చెప్పావు కదూ ఏదో ఒకటి ఖాయం చేసిఆకాస్త ముడీ వేసి మరీ పంపండి" నవ్వుతూనే అన్నాడు.

"అంతే అన్నగారూ పాతిక వేలిస్తామని పాతికమందన్నా వచ్చారు నా తండ్రికి అసలు అడ్వాన్సు కూడా ఇస్తాం అంటే.."

"నేనే తీసుకోవద్దు ముందే అన్నాను" కుటుంబరావు పూర్తి చేశాడు.

శ్రీహరి ముఖం గంభీరమై పోయింది. "అమ్మా నాపెళ్ళి ఇప్పుడు కాదు. ముందు చెల్లాయిల పెళ్ళి చేసేసిన తర్వాత. నా ఫ్రెండ్ ఒకతను యివాళే రైలుకి వస్తాడు మన శ్రీలక్ష్మిని చూసుకునేందుకు. మంచివాడు, మనకి తగినవాడు. మనం యివ్వగలిగింది చాలు అనేవాడు. యివన్నీ కలిసి పెళ్ళి అయిపోవాలనే భగవంతుడికిప్రతి రోజూ దణ్ణం పెట్టుకుంటున్నాను నేను".

"అయ్యో పాతిక వేలూ పుచ్చుకుంటే ఇద్దరి పెళ్ళి చేయచ్చుగా" లక్ష్మీనర్సు నీరసపడిపోతూ అంది.

ఇంక కుటుంబరావు భగ్గున మండిపడుతూ "కానీ కట్నం కన్నవాళ్ళు తీసుకోకూడదు. జీతంలో పైసా యెరగం యింతవరకూ కానీ పెళ్ళి చేయాలట పెళ్ళి యెట్లా జరుగుతుందిరా!"

"యెలా జరుగుతుందో అలా చూస్తూండండి. నేను చేస్తాను. ప్రతి పైసా దాచి మూటకట్టి తెచ్చాను. నాన్న మీ తరం వాళ్ళలా జీవితాన్ని నరకం చేసుకోం మేం, నా పెళ్ళయితే యీ ఇల్లూ చెల్లాయిలూ ఇలా వుండి పోవాల్సిందే అందుకే నాకు పెళ్ళి అక్కరలేదు. నాకర్తవ్యం నాకు తెలుసు. మీతరం వాళ్ళకులా అసమర్ధులంగా కూర్చోం. క్రియ ప్రధానం చేస్తాం. మేం ప్రతినెలా పంపిన డబ్బు మీ నిత్య అవసరాలకి తగలేసి చేతులు యెత్తేస్తారని నాకు తెల్సు. "పాంటు జేబులోంచి పర్సు తీసి నోట్ల కాయితాలు చేత్తో కదుపుతూ తండ్రి వైపు చూస్తున్న శ్రీహరి భుజం మీద చెయ్యి వేసి ఆత్మీయంగా తడుతూ గోపాలరావు "శ్రీహరి సెభాష్. మంచిపని చేశావు నాయనా చిన్నవాడివైనా పెద్ద ఆలోచన. నీ తల్లి మెచ్చే ఆలోచన బాగుంది. అన్నట్లు నే వెడతాను. అబ్బాయికి భోజనం చూడండి అంటూండగా ధనలక్ష్మి అక్కకోసం ఇల్లూ వాకిలీ అంతా వెతికి వంట గదిలో దొరికిన ఉత్తరాన్ని చదివి అమ్మో అని అరుస్తూ వచ్చి "అమ్మా అక్క పెట్టే బట్టలూ లేవు పైగా యీ వుత్తరం వుంది" అంటూ ఇచ్చింది. కుటుంబరావు చదివి "కొంపకూల్చేసిందే యిదీ" అని కూలబడి పోయేసరికి "యేమైందండీ" లక్ష్మీనర్సు గుండె పట్టుకుని అడిగింది గాభరాగా.

శ్రీహరి ఆ కాయితాన్ని అందుకుని బిగ్గరగా చదివాడు. "నాన్నా

నేనీ బంది ఖానాలోంచి వెళ్ళి పోతున్నాను. మీకు అమ్మ అనారోగ్యం మీ ఆర్ధిక యిబ్బందులూ మీ కోపతాపాల్లో మా వయస్సు, కోరికలూ గుర్తు లేవు అనుకున్నాను. నావయస్సు ఇరవై మూడు కోరికలని యింక జయించలేను. అన్నయ్యమీద కొండంత ఆశ పెట్టుకుని వారాలూ నెలలూ దొర్లించాను. కానీ అన్నయ్య రావటం కలలోని మాట అనే అన్పించింది. వాడు ఒకవేళ యే రిజిష్టరు మేరేజీ అయినా చేసుకుని వుండవచ్చు అనేనా అనుమానం నివృత్తికాకున్నా యింక నిరీక్షించలేక పోయాను.

అందుకే నేను కావాలని రెండేళ్ళుగా నావెంటబడిన ప్రక్కరోడ్డులోని ఆంజనేయులుతో మెద్రాసు వెళ్ళిపోతూన్నాను. నాకోసం విచారించక చెల్లాయి పెళ్ళి

అయినా చేసేయండి నాన్నా నా భవిష్యత్తు గురించి నేను భయపడటంలేదు. అందుకే మీ అందరికీ దూరంగా వెళ్ళి పోతున్నాను.

అమ్మకి నమస్కారాలు. చెల్లాయిలకి ఆశీస్సులు. శ్రీలక్ష్మి.

వుత్తరం అంతా విన్న లక్ష్మీనర్సు 'ఆ...!' అని పెద్దకేక పెట్టి విరుచుకుపడిపోయింది. మిగతా పిల్లలంతా ఘొల్లుమన్నారు.

"అయ్యో చెల్లాయీ నీకోసమే కదమ్మా... నేనింత కష్టపడి పైసా పైసా కూడబెట్టి తెచ్చింది" శ్రీహరి జుట్టు పీక్కుంటూ వెర్రివాడిలా చూస్తూ వుండి పోయాడు గోపాలరావు తీవ్రంగా ఆలోచించి.

"శ్రీహరి మెడ్రాసు వేళ్ళే రైలుకి యింకా టైము వుంది పద వెడదాం."

"ఔనుకదూ" అంటూ ఆయనతో వెళ్ళిపోయాడు శ్రీహరి. కుటుంబరావు గభాలున లేచి తనూ పరిగెత్తాడు.

లక్ష్మి నర్సు కుమిలి కుమిలి యేడుస్తోంది. తన పరువు బజారున పడేసి వెళ్ళిన కూతుర్ని తిడుతూ అంతలోనే పిల్ల పెళ్ళి చేయలేని భర్త అసమర్ధతని దుమ్మెత్తిపోస్తూ మళ్ళీకూతురు ఇల్లుచేరేలా చేయమని భగవంతుడికి మొక్కులు మొక్కుకుంటూ వుంది. దనలక్ష్మి తెల్లబోయి అలాగే నిల్చుండి పోయింది. తన అక్కలో ఇంత తెగింపు యెలా వచ్చింది. అసలా ఆంజనేయులుగాడు కోతిలాంటి వెధవ. పైసా సంపాదించే తెలివిలేదు. అలాంటి వాడిని నమ్మి వెళ్ళిందా అక్క అన్నదే ఆ అమ్మాయి ఆలోచన. "ప్రేమ కథల పైత్యం తలకెక్కితే ప్రతి వెధవా హీరోలానే కనిపిస్తాడు. అక్కా ఆ కథలు చదవకు" అని నెత్తి నోరూ మొత్తుకుని చెప్పింది తను. అయినా అక్క ఇంత తెలివి తక్కువగా చేస్తుందని కలలో కూడా అనుకోలేదు తను.

ఇంక శ్రీహరి గోపాలరావు రైల్వేస్టేషనుకి చేరేసరికి రైలు వచ్చి ప్లాట్‌ఫారం మీద నిల్చివుంది. ప్రయాణీకులు గుంపులు గుంపులుగా ఒకర్ని ఒకరు తోసుకుంటూ రైలు పెట్టెల్లోకి యెక్కటానికి ప్రయత్నిస్తున్నారు. శ్రీహరి యీ చివరనుంచి ఆ చివరికి పరుగుతీస్తూ కన్పించిన ప్రతి ఆడపిల్లా తన చెల్లెలే అనుకుంటూ వాళ్ళ ముఖంలోకి పరీక్షగా చూస్తూ రైలు బయలుదేరటానికి యెక్కువ ఆలస్యం లేదు అన్నది తెల్సుకుని పిచ్చివాడిలా గొంతెత్తి.

"చెల్లీ రైలెక్కకమ్మా! నేను వచ్చేశానమ్మా. తల్లీ నీ కోసమే వచ్చానమ్మా చెల్లీ రైలెక్కకమ్మా" అని అరుస్తున్నాడు.

శ్రీహరి గొంతు ప్లాట్‌ఫారం అంతా ప్రతిధ్వనిస్తోంది. శ్రీహరి గొంతువిన్న శ్రీలక్ష్మి గుంపులోంచి తోసుకుంటూ త్వరగా రైలెక్కాలని విశ్వప్రయత్నం చేస్తోంది. యింక ఆంజనేయులు కాళ్ళలోనించి వణుకు వస్తోంది. శ్రీహరి గొంతు వింటూంటే. యెలాగో తంటాలుపడి ముందు తను యెక్కి సూట్‌కేసు లోపలకి తోసి వెనక్కి వెడుతూన్నశ్రీలక్ష్మికి చెయ్యి అందించి రైలు పెట్టెలోకి యెక్కుమని తొందరచేస్తున్నాడు. యీ యిద్దరినీ అరగంటనించీ పరికించి చూస్తూ ఆ స్టేషన్‌లో రైలెక్కటానికి వచ్చిన ఓ అమ్మాయి గబగబా తోసుకుని పైకి ఎక్కేసి శ్రీహరి కేకలకి వీళ్ళిద్దరూ కంపించిపోవటం గుర్తించి ఆంజనేయులు దగ్గరగా జరిగి ఓ చిరునవ్వు పారేసింది. ఆ నవ్వుకి పరవశించి పోయిన అతను ఇ హి హి అంటూ శ్రీలక్ష్మి చేతిపట్టు సడలించాడు. 'అరె చెయ్యివ్వు' అంటోన్న శ్రీలక్ష్మితో.

"యీ సిల్కుచీర అమ్మాయి" అంటూ నోరు తెరుచుకు చూస్తోంటే ఆ అమ్మాయి యింకాస్త అతనిమీదికి వంగుతూ శ్రీలక్ష్మి వైపు కోపంగా చూస్తూ "చెల్లీ రైలెక్కకమ్మా" అనే ఆ పిలుపు కాస్త విను చెల్లెమ్మా యెవరో అతను మీ అన్న కాదు కదా" అంటూ పైకి యెక్కబోతున్న శ్రీలక్ష్మిని క్రిందికి ఒక నెట్టు నెట్టింది. 'ఆ. ఆ' అంటున్నాడు ఆంజనేయులు క్రిందకి దూకబోతుంటే అక్కడే వున్న యిద్దరు కుర్రాళ్ళు బ్రతకాలనిలేదా అనేసి వెనక్కి లాగారు. ఆంజనేయులు సిల్కు చీరె అమ్మాయి మీదకి వస్తూ,

నువ్వు...నువ్వు...నువ్వే నా శ్రీలక్ష్మిని క్రిందకి ...త్రోశావు" అంటూంటే ఆ అమ్మాయి కళ్ళెర్రజేసి ఆదిశక్తిలా విరుచుకుపడింది.

"షటప్ నీలాంటి వాళ్ళు అమాయకులైన ఆడపిల్లలని రైలెక్కించగలరు. కానీ జీవితాంతం భరించగలరా. అరిచావా జాగ్రత్త. గంట నించీ మీ ఇద్దరినీ చూస్తూనే ఉన్నాను" అనటంతో తేలుకుట్టిన దొంగలా కిక్కురుమనలేదు ఆంజనేయులు. కానీ ప్రక్కనున్న వాళ్ళు ఆ అమ్మాయితో 'నిజాన్ని అంత త్వరగా యెలా గ్రహించగలిగారు' అడిగారు. ఆ అమ్మాయి కళ్ళలో నీటిపొర కదిలింది. నేనూ ఆ పిల్లలా అందరినీ వదిలి రైలెక్కినదాన్నే. అందుకే జీవితం విలువ బాగా తెల్సు. అందుకే నాలా మరో ఆడపిల్ల కాకూడదు" అని అంటుంటే ఆ అమ్మాయి కంఠం బొంగురుపోయిది. వెంటనే ముఖం కిటికీ వైపు తిప్పి శ్రీలక్ష్మి ఏమైందో అని వంగి కన్పించినంతవరకూ చూస్తోంది. ఆ అమ్మాయికి ఇంకా చెవుల్లో ప్రతిధ్వనిస్తోనే ఉంది. "చెల్లీ రైలెక్కకమ్మా" అనే పిలుపు.

ఇలాంటి అన్నయ్య నాకానాడు వుంటే నడుస్తూన్న రైలు దూకి అన్నా అన్నయ్యని తిరిగి చేరుకుని వుండేదాన్ని" అనుకుంటూ కళ్లలో దుమ్ము పడుతున్నా ఇంకా అలాగే చూస్తోంది.

క్రిందపడిన శ్రీలక్ష్మిని శ్రీహరి చెయ్యి అందించి లేవనెత్తి "చెల్లీ ఎంత సాహసం చేశావమ్మా" అంటూండగా రైలు దిగి బైటకి వెళ్లబోతున్న రామారావు మిత్రుడిని చూసి గుర్తించి "హల్లో శ్రీహరి అరె నాకోసం స్టేషనుకి వచ్చావా." అంటూనే అన్నగారి చెయ్యి ఆసరాతో లేవబోయి కాళ్ళుపట్టేసినట్లు కిందకి జారిన శ్రీలక్ష్మిని పరీక్షగా చూస్తూ దగ్గరగా వస్తూన్న మిత్రుడిని చూసి తెల్లగా పాలిపోతున్న ముఖాన సంతోషాన్ని పులుముకోజూస్తూ "హలో రావ్ ...నీకోసమే వచ్చా...అహఁ...కాదు...చెల్లాయి ఫ్రెండ్ ఈ రైల్లో వెడుతూంటే వీడ్కోలు ఇచ్చేందుకు..అహ కాదు నీకు..ఆమె ...అదిగో. చూడు చెయ్యిఇంకా ఊపుతూ ఒంగి చూడటంలా....ఆ అమ్మాయి" అంటూ తడబాటుని కప్పిపుచ్చుకో చూస్తున్న శ్రీహరిని అంతగా పట్టించుకోకుండా "నేను ఆసరా యివ్వనా మీ చెల్లెయి -లా క్రిందకి జారిపోతోందేం" అంటూ ఒకవైపు చెయ్యి అందించాడు. శ్రీలక్ష్మి అన్నగారినీ, రామారావునీ మార్చి మార్చి చూసింది. రామారావులో అందం కంటే వ్యక్తిత్వం నెమ్మదీ ఇంకా యెన్నో లక్షణాలు కన్పిస్తూ ఉంటే ఆశ్చర్యంగా అతని వైపు రెప్పవాల్చకుండా చూస్తూ శ్రీలక్ష్మి అతని యెడం చెయ్యి ఆసరాతో ఒక్కో అడుగూ వేస్తోంది. ఒకవైపు అన్నగారూ, మరోవైపు రామారావూ సాయంతో మెల్లగా నడిచివెళ్ళే శ్రీలక్ష్మిని రైలు మలుపు తిరిగే వరకూ చూస్తూ సంతోషంతో చెమర్చిన కళ్ళని పైటకొంగుతో తుడుచుకుంటూ సంతృప్తిగా నిట్టూర్చింది సిల్కుచీరె అమ్మాయి.

రైలు మాత్రం వేగాన్ని పుంజుకుని వెళ్ళిపోతూనే ఉంది.

(ఆంధ్రపత్రిక 29-8-75)